# శ్రీ రమణ జ్యోతి

సంపుటి-45 సంచిక - 2 హైదరాబాదు ఫిబ్రవరి, 2025 పేజీలు - 52 రూ. 10/- సంవత్సర చందా : రూ. 100/-

# SRI RAMANA JYOTHI

Vol - 45 Issue - 2 Hyderabad February, 2025 Pages - 52 Rs. 10/- Annual Subscription Rs. 100/-



***BHAGAVAN SRI RAMANA MAHARSHI***



*ARUNACHALA HILL* (అరుణాచల గిరి)

స్మరణమా త్రముననె పరముక్తి ఫలద । కరుణామృ తజలధి యరుణాచ లమిది ॥

శ్రీ రమణ జ్యోతి | Sri Ramana Jyothi
ఫిబ్రవరి 2025 | February 2025


ఈ సంచికలో ... IN THIS ISSUE ...


1. డా॥ కే.యస్. గారి 126వ ప్రవచనం — వి. రామదాస్ మూర్తి 3
2 రమణ సద్గురు - యస్.యస్. కొహెన్ — సరోజా ప్రసాద్ 10
3. రమణుల జీవితంలోని కొన్ని సన్నివేశాలు: బి.వి. నరసింహస్వామి — రవికృష్ణ శర్మ 16
4. శ్రీ భగవాన్ నా జీవితంలోకి ఎలా ప్రవేశించారు? — తాడిమేటి సత్యనారాయణ 22
5. భగవాన్ భక్తులు - గోవులు — వి. రమేష్ బాబు 29
6. Why Gandhiji and Bhagavan Never Met — Dr K Subrahmanian 30
7. Ashtavakra Gita 33 — V Krithivasan 37
8. When the Final Question becomes the First Question — V Siva Kumar 41
9. Rajammal Nilakantha — Sneha Choudhury 44
10. V. Mani Iyer - An Early Devotee — Viswanatha Swami 48
11. Composition of the Song, Saranagati 50


## Events in Sri Ramana Kendram in February 2025

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 10th - Punarvasu Satsang - 6.00 - 7.00 p.m.
3. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.

(పాఠకులు దయచేసి తమ ఫోన్ నంబరు,e- మెయిల్ అడ్రెస్, శ్రీ రమణకేంద్రం ఆఫీసుకు వెంటనే ఫోన్ చేసి తెలియజేయగలరు)

(Readers are requested to kindly intimate the Sri Ramana Kendram Office, their Phone Number and e-mail address)


© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.


**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# సమయానికి ఆదుకుంటాడు

కే.యస్. గారి 126వ ప్రవచనం

అనువాదం: వి. రామదాస్ మూర్తి

చలికాలంలో చలి తీవ్రతను బట్టి మనం స్వెటర్లు లేదా సూట్లు వాడతాం. చలి నుండి రక్షణ కావాలి కనుక అలాంటి దుస్తుల అవసరం ఉంటుంది. చలికాలంలో తిరువణ్ణామలై చల్లగా ఉంటుంది. అందులోనూ నవంబర్-డిసెంబర్-జనవరి నెలల్లో చలి తీవ్రత మరింతగా ఉంటుంది. తిరువణ్ణామలై వచ్చిన తొలి సంవత్సరాలలో భగవాన్ విరూపాక్ష గుహలోను, స్కందాశ్రమం లోనూ ఉండేవారు. కొండమీద చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. భగవాన్ వద్ద ఒక టవల్ కూడా ఉండేది కాదు. కానీ భగవాన్ ఎప్పుడూ చలిగా ఉండడం గురించి ప్రస్తావించేవారు కాదు.

కొండమీద ఉంటున్న కొందరు గోనె సంచులను శాలువాల లాగా చేసుకుని వాడేవారు. భగవాన్‌కు కూడా అలాంటిది ఇస్తా మన్నప్పటికీ తీసుకునేవారు కాదు. మీకు అవసరం, మీరు వాడుకోండి అనేవారు. కొందరు ఆ శాలువాలను దోమల నుండి రక్షణ కోసం ఉపయోగించేవారు. తమను దోమలు కుట్టవని చెబుతూ వాళ్ళనే వాడుకోమనేవారు భగవాన్. ఇతరుల గురించి అంతగా ఆలోచించే భగవాన్, తమకు ఏదీ వద్దనే వారు. అలాగని అలాంటి రక్షణ చేసుకోవద్దని ఎవరికీ చెప్పేవారు కాదు. నిజమైన జ్ఞానికి, జ్ఞానులుగా నటించే ఇతరులకు అదే భేదం. సాధారణంగా మనం నడుచుకునే విధంగా ఇతరులు కూడా అనుసరించాలని

అంటాం. కానీ భగవాన్, తమకు అవసరంలేని వాటిని ఇతరులు కూడా వాడకూడదని ఎప్పుడూ అనలేదు. అందరిని తమ మాదిరే ఉండమని చెప్పలేదు.

**తల్లి ప్రేమ**

ఉదాహరణకు తల్లికి ఏదో వస్తువు మీద అయిష్టత ఉండవచ్చు. కానీ తన బిడ్డ మంచి కొరకు అని డాక్టర్ చెబితే తప్పక దాన్ని తీసుకుంటుంది. కొంతమంది వెల్లుల్లి అంటే ఇష్టపడరు. కానీ బిడ్డకు రెండు మూడు నెలల వయసు ఉన్నప్పుడు ఆయుర్వేద డాక్టరు తల్లిని వెల్లుల్లి ఉండే మందును తీసుకొనమని చెబితే తనకు ఇష్టం లేకపోయినప్పటికీ తీసుకుంటుంది. అలాగే సాధువులు, ఋషులు ఎన్నిటినో ఇష్టా ఇష్టాలతో సంబంధం లేకుండా మన కోసం చేస్తారు.

కొన్ని సమయాల్లో మన చుట్టూ కుటుంబము, స్నేహితులు ఉన్నప్పటికీ ఏదో ఒంటరిగా ఉన్నట్లు అనిపించవచ్చు. అది వ్యక్తి వయస్సు, హోదాతో నిమిత్తం లేకుండా... ఈ లోకంలో తాను ఒక్కడే ఉన్నట్లు తోచవచ్చు. కానీ, కొద్దిసేపటి తర్వాత పుస్తకం చదవడమో లేదా ఎవరినో చూడడానికి బయటకు వెళ్లడమో చేసి, ఆ ఏకాంతతను మరువవచ్చు. అదే భగవత్కృప మనకు కలిగి ఉంటే, అలాంటి భయంకరమైన ఏకాంతత మనల్ని బాధించదు. అమితమైన ధైర్యాన్ని ఇస్తుంది.

మనకు జీవితంలో ఎన్నో అనుభవాలు జరుగుతూ ఉంటాయి. అది మన ప్రయత్నం వల్లనేనని మనం అనుకున్నప్పటికీ,

ఆలోచించిన మీదట ఎవరో మనకు సమయానికి మార్గదర్శనం చేస్తున్నారని తెలుస్తుంది. అలాంటి అనుభవాలు భగవంతునిపై మన నమ్మకాన్ని బలపరుస్తాయి. కానీ ఆయన మనకు తోడుగా లేని క్షణమే ఉండదని మనం గుర్తించాలి. పుస్తక పఠనం ద్వారా మాత్రమే అది ఏర్పడదు.

**నిరంతర రక్షణ**

ఒక్కసారి భగవంతుని గురించిన నమ్మకం కలిగితే, అది మనలో ఎప్పుడూ భయంకరమైన ఏకాంతంలో ఉన్న భావనను ఏర్పడనీయదు. మన లోపలే మనల్ని ఎల్లప్పుడూ రక్షించేవాడు ఉన్నాడన్న గుర్తింపు కలుగుతుంది. మనం గడ్డు రోజులను గడుపుతున్నప్పుడు, సంతోషంగా ఉన్నప్పుడు, ఎచ్చటనైనా సరే ఒకే రకమైన శాంతిని, భద్రతను భగవంతుడు కలిగిస్తూనే ఉంటాడు. మానసికంగా కృంగిపోవలసిన అవసరం లేదని, ఒక ఉన్నత శక్తి రక్షణలో మనం ఎల్లప్పుడూ ఉన్నామని భగవంతుడు ధైర్యాన్ని, భరోసాను ఇస్తూనే ఉంటాడు.

సంపూర్ణ శరణాగతి చెందిన వారి అవసరాలను భగవంతుడు ఎల్లప్పుడూ తీరుస్తూనే ఉంటాడు. ఆ భావన గట్టిపడే కొద్దీ మరింత శాంతి లభిస్తుంది. అందుకే మనం అసాధ్యమని తలచేవి కూడా సాధ్యపడతాయి. ఇలాంటి సందర్భాలు జీవితంలో జరిగినప్పటికీ వాటిని మరిచిపోయి దుఃఖపడడం, ఒంటరితనం అనుభవించడం జరుగుతూనే ఉంటుంది. అలా ఉండవలసిన అవసరం లేదని, అన్ని విషయాలను ఆ ఉన్నత శక్తి అదుపులోకి తీసుకుని మనల్ని

ఎలా ఉంచాలో అలా ఉంచి మన అవసరాలను తీరుస్తుందని భగవాన్ చెబుతారు.

మీకు ఒక విషయం తెలిసి ఉండవచ్చు. కొన్ని ఏళ్ళ క్రిందట అంటే 1959లో నేను మాన్‌చెస్టర్ నుండి నాటింగ్‌హామ్‌కు సుమారు సాయంత్రం ఐదు గంటలకు బయలుదేరాల్సి ఉన్నది. కానీ కుదరలేదు. రాత్రి 8 గంటలకు బయలుదేరాల్సి వచ్చింది. నాకు స్థలం క్రొత్తది, వెళ్ళాల్సిన చోటు క్రొత్తది. బాగా చలిగా ఉన్నది. అర్థరాత్రి సుమారు 12 గంటలకు నాటింగ్‌హామ్ చేరాను.

రైలు దిగిన తర్వాత రాత్రి ఎక్కడ గడపాలని హోటల్లో ఒక్కొక్కసారి వసతి దొరకడం కష్టమే అని ఆలోచిస్తున్నాను. అప్పుడు ఎవరో నా వీపు మీద తట్టారు. రాజస్థానీ అయిన అతడిని ఐదు నెలలకు పూర్వం లండన్లో కలిశాను. అతను నాటింగ్‌హమ్‌లో ఉంటాడన్న సంగతి మరచిపోయాను. అప్పటివరకు ఒకటి, రెండు సార్లు మాత్రమే కలిసిన అతడిని ఆ రోజు అర్థరాత్రి కలవడం జరిగింది. తాను తన తమ్ముడిని రైలులో ఎక్కించడానికి అనుకోకుండా వచ్చానని, తన ఇంట్లో ఉండాలి అని కోరాడు. ఎలాగూ ఏదో ఒక హోటల్లో వసతి దొరికి ఉండేదేమో అన్నది వేరే విషయం కానీ, పరిస్థితులు వాటంతట అవే అలా మారాయి. అలాంటి సందర్భాలు మీకు కూడా ఏర్పడి ఉండొచ్చు. కానీ, కష్ట సమయాలలో మనం బయటపడడం గురించి ఎవరో ప్రణాళిక వేసి ఉంటారని గుర్తించాలి.

**కాకతాళీయం కాదు**

భగవంతుడు మన కోసం అలాంటి ఏర్పాట్లు చేస్తాడు. మన పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూనే ఉంటాడు. కానీ, అలాంటి సందర్భాలు ఏదో అలా కాకతాళీయంగా జరిగి ఉంటాయని మనం అనుకుంటాం. అలాంటి ఆలోచన వల్ల మనకు నష్టమే గాని భగవంతునికి కాదు. సరైన ధోరణిలో మనం ఆలోచిస్తే భగవంతుడు మనకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటాడని తెలిసి వస్తుంది. ఆదుర్దా పడవలసిన అవసరం ఉండదని భగవాన్ చెబుతారు. ఇక ఏ ఆశ లేదని అనిపించిన స్థితిలో కూడా ఏదో ఒక మలుపు వస్తుంది. పరిస్థితి బాగుపడుతుంది. ప్రతి సమస్య అసాధారణంగా అధిగమింప బడుతుంది. అలాంటి సందర్భాలలో భగవంతుని కృప, కరుణల గురించి అర్థమవుతుంది.

ప్రతి ఒక్కటి నా వల్లే బాగుపడింది, పరిష్కారమైందని ఆలోచిస్తూ పోతే, ఒక దశలో మన మీద మనకే నమ్మకం పోతుంది. మనకు సహాయపడిన వారు కూడా తాము ఏమీ చేయలేదని చెప్తే మనం ఇబ్బంది పడకుండా ఉంటాం. మనం గౌరవభావంతో చూసే వ్యక్తుల వద్దకు వెళ్లి కష్టాలను గురించి చెప్పినప్పుడు, వాళ్లు ఓపిగ్గా వింటే మనకు ఎంతో సంతృప్తి కలుగుతుంది. కారణం, మనం అనుభవించే ఒత్తిడిలో కొంత వారు గ్రహిస్తారు. కొందరు సముదాయించి ధైర్యాన్ని ఇస్తారు. కొందరు సమస్యలు తీరిపోవాలని దేవుడిని ప్రార్థించవచ్చు కూడా. వాళ్లే పరిష్కారం చేయాలని అనుకోరు.

కంచి ఆచార్యుల దగ్గరికి వచ్చి ఎందరో తమ కష్టాలను విన్నవించుకునేవారు. ఆయన "నేను మీ సమస్యలను పరిష్కరించ లేను కానీ పూజ సమయంలో, కామాక్షి దేవిని, అమ్మ ఈ ప్రజలు కష్టాల్లో ఉన్నారు నీవు ఏమైనా చేసి వాళ్లను కాపాడు" అని ప్రార్థిస్తాను అని చెప్పేవారు. నమ్రత అంటే అది.

గొప్ప సాధువు, గురువు మీ సమస్యలను వినిన క్షణంలో ఎన్నో అనుకోనివి జరుగుతాయి. మనకు సాధారణంగా జరిగేలాగా కాకుండా దైవికంగా ఎన్నో శ్రేయస్సులు కలుగుతుంటాయి. సమస్యలు ఉన్నప్పటికీ మనకు మానసిక ప్రశాంతత ఏర్పడుతుంది. లేదా ఆ కష్టాలే తొలగిపోతాయి. అది మన ఊహలకు మించినది. ఒక్కొక్కసారి ఆ మహాత్ముడే ఆ సమస్యలను తానే గ్రహిస్తాడు.

**సమస్యలను ఆలకించాలి**

బిడ్డ ఎందువల్లనైనా బాధపడుతున్నప్పుడు తల్లి స్వయంగా బాధపడుతుంది. అది ఎలాగ జరుగుతుందని అడిగితే మనం వివరించి చెప్పలేము. ఏసుక్రీస్తు నేను మనిషి పాపాలను స్వయంగా స్వీకరిస్తాను అని బాహాటంగా ప్రకటించారు, కానీ భగవాన్ అలాగ ఎన్నడూ చెప్పలేదు. శ్రీ రామకృష్ణ "నాకు ఈ క్యాన్సర్ ఎవరిచ్చారు" అనేవారు. మనమే మన సమస్యలను బాధలో చెప్పుకుంటాము. ఈ విషయం మనం ఖచ్చితంగా ఎటూ చెప్పలేము. అటూ-ఇటుగా చెప్పేవాళ్లు ఉంటారు. ఏది ఏమైనా దయ, గొప్ప కరుణ అన్నవి ఉంటాయి. అందుకే భగవంతునిపై భారాన్ని వేస్తే సరి. బాధలను మనం భరిస్తున్నాం అన్న భావన తొలగిపోవాలి. శరణాగతి దానికి

మార్గం. ఆ భరోసాను భగవాన్ మనకు ఇచ్చారు. దాని అర్థం మనం కూడా ఎవరైనా తమ సమస్యలను మన ముందు ఉంచితే, వాటిని ఓపిగ్గా వినాలి. అంతేగాని, సమయం లేదని లేదా మరో కారణంగా అశ్రద్ధ చేయరాదు.

కొన్ని సందర్భాలలో బడికి వెళ్లిన బిడ్డకు దెబ్బ తగలడం లేదా ఎవరో ఎగతాళి చేయడం వంటివి జరగవచ్చు. గట్టిగా ఉన్న పిల్లలు ఎదురు చెప్పవచ్చు, కానీ మృదుస్వభావం కలవారు అలాగ చేయరు. ఇంటికి వచ్చి తల్లిదండ్రుల వద్ద ఏదో అంటారు, కోపం తెచ్చుకుంటారు. తమ బాధను అలాగ వెళ్లగక్కుతారు. తల్లితండ్రులు తాము విసుక్కోకుండా, బిడ్డను మళ్ళీ తిట్టకుండా సముదాయించాలి. బిడ్డల బాధను అలా కొంతవరకు తగ్గించే ప్రయత్నం చేయాలి. ఇది పెద్దలకు కూడా వర్తిస్తుంది. ఇతరులు కర్కశంగా, లేదా బాధ కలిగేలాగా చేసినప్పటికీ మనం ఓర్పును కోల్పోకుండా ప్రవర్తించాలి. అలాగే ఎవరైనా మిమ్మల్ని మెచ్చుకుంటే కూడా పొంగిపోకుండా దాన్ని మామూలుగా తీసుకోవాలి. అంటే, అన్ని సందర్భాలలో సమత్వాన్ని పాటించాలి. అలాంటి ధోరణి అలవడడానికి భగవంతుని దయ, కృప ఉండి తీరాలి.

**అపూర్యమాణం అచల ప్రతిష్ఠం**
**సముద్రమాపః ప్రవిశంతి యద్వత్ ।**
**తదవత్ కామ యం ప్రవిశంతి సర్వే**
**స శాంతిమాప్నోతి న కామకామీ ॥**

******

# రమణ సద్గురు
# యస్.యస్. కొహెన్

**శ్రీ రమణాశ్రమ ప్రచురణ** Fragrant Petals **లోని 9వ వ్యాసానికి స్వేచ్ఛానువాదం**

**సరోజా ప్రసాద్**

మరలా శ్రీ రమణుల జయంతి వచ్చింది. వేలకొలది పాత భక్తులకు, క్రొత్తవారికి, దేశ విదేశాలలోని వారికి, ఇదొక సంతోష సమయం. భగవాన్ తమపై ఏ విధంగా అనుగ్రహం చూపారో, వారంటే తమకు ఎంతటి ఆరాధనా భావమో, తమ జీవితాలను, వారు ఏ విధంగా ప్రభావితం చేశారో, తలచుకొని పరవశిస్తారు. చిరకాలం వారి సన్నిధిలో గడిపిన పాత భక్తులు - భగవాన్ శరీరధారులై ఉండగా, తమలో ఎటువంటి పరివర్తనకు నాంది పలికారో, అది ఇంకా కొనసాగుతూనే ఉన్నదంటారు. క్రొత్తవారికి కూడా భగవాన్, తమ సాధనకు ఎంత తోడ్పాటునందిస్తున్నారో అనుభవానికి వస్తుంది.

ఈ శరీరం గురువు కాదు అని భగవాన్ చెప్పినప్పుడు చాలా మందికి అర్థం కాలేదు. కాలం గడిచేకొద్దీ, భగవాన్, భక్తులను అనుగ్రహించి, వారి సాధనకు తోడ్పాటునివ్వడంతో, భగవాన్ మాటల ఆంతర్యం క్రమేపీ వారికి అర్థం కాసాగింది. చివరికి, భగవాన్ అంటే భౌతిక దేహం కాదని గ్రహించే స్థాయికి ఎదిగారు వారు. ఈ సందర్భంగా భాగవతంలో శ్రీకృష్ణుడు, ఉద్ధవుల మధ్య గురు-శిష్య సంబంధం గురించిన ఉదంతం గుర్తుచేసుకోవాలి.

ఈ భూమిపై శ్రీకృష్ణుడు తన అవతారం చాలించి, వైకుంఠానికి

తిరిగి వెళ్ళే సమయం ఆసన్నమయింది. అది భరించలేని ఉద్ధవుడు కన్నీటి పర్యంతమై, తనను కూడా తీసుకు వెళ్ళమని శ్రీ కృష్ణుని ప్రార్థిస్తాడు. "యాదవ కుల నాశనం తరువాత, నీవు భువి నుండి శాశ్వతంగా వెళ్ళిపోతావని నాకు తోచుచున్నది. నీ పాదార విందములకు దూరమై, నేను క్షణం కూడా బ్రతుకజాలను. నీ దివ్య ధామానికి, నీవెంట నన్ను కూడా తీసుకు వెళ్ళు స్వామి! నీ వియోగాన్ని ఎలా భరించగలను?" అని అర్థిస్తాడు.

దానికి సమాధానంగా శ్రీకృష్ణుడు, తన శరీరంతో బంధం పెంచుకోవడం ఉద్ధవుడికి మంచిది కాదని, తన నిర్యాణం తరువాత కూడా, జీవితం కొనసాగించాలని ఉద్బోధిస్తాడు. బంధు మిత్రులతో అన్ని బంధాలు తెంచుకుని హిమాలయాలకు వెళ్ళి, తనమీదే సంపూర్ణంగా మనస్సు లగ్నం చేసి, యోగ సాధన కొనసాగించ వలసిందిగా ఉపదేశిస్తాడు.

"మిత్రమా, ఉద్ధవా! సదా గుర్తుంచుకో.... మనస్సు ఏది తలుస్తుందో, కన్ను దేనిని చూస్తుందో, నోరు దేనిని పలుకుతుందో - అదంతా మనస్సు కల్పించే మాయాజాలం. నీ మనస్సును, ఇంద్రియాలను అదుపుచేయడం ద్వారా ప్రపంచాన్ని నీలో దర్శిస్తావు. పరమాత్మనైన నాలో నిన్ను చూస్తావు. ఈ జ్ఞానం సిద్ధించి, స్వస్వరూపం తెలుసుకున్నావంటే, ఇక నీకు జీవితంలో ఎటువంటి ఆటంకాలు ఎదురుకావు" అంటాడు శ్రీకృష్ణుడు.

ఇదేవిధంగా, భగవాన్ కూడా మనస్సును ఆత్మ విచారణలో లగ్నం చేసి అంతరాత్మను తెలుసుకొనడమే అత్యుత్తమ సాధనగా పేర్కొన్నారు. బాహ్య గురువును సేవించడం అనేదానికి, దీని

తరువాత స్థానమే. సేవ కంటే ధ్యానానికే భగవాన్ ప్రాధాన్యమిచ్చారని నా సమక్షంలో జరిగిన ఒక సంఘటన ఋజువు చేసింది.

ఆశ్రమ కార్యాలయంలో ఆంగ్ల ఉత్తర ప్రత్యుత్తరాలు చూస్తుండే భక్తుడొకరు అందుబాటులో లేకపోవడంతో, ఆ బాధ్యతలు చూడవలసినదిగా, సర్వాధికారి అప్పుడు ఆశ్రమంలోనే ఉన్న మేజర్ చాడ్విక్ ను కోరారు. చాడ్విక్ అందుకు నిరాకరించారు గాని, తరువాత ఏదో అపరాధ భావనకు గురైనారు. ఆ రాత్రి భోజనానంతరం, భగవాన్ తో మేము ఏకాంతంగా ఉన్న సమయంలో, చాడ్విక్, జరిగిన సంగతి భగవాన్‌కు నివేదించి, తానేమన్నా తప్పు చేశానా అని అడిగారు. అందుకు భగవాన్ బదులిస్తూ, ‘‘ధ్యానమే తమకు చేయగల నిజమైన సేవ’’ అనడంతో చాడ్విక్ ఊరట చెందారు.

మోక్షసాధనకు గురువు అవసరం ఉన్నదా అని ప్రశ్నిస్తే, ఉన్నదనే చెప్పారు భగవాన్. నిజానికి కేవలము ఉపనిషత్తుల అధ్యయనం కంటే, ఒక జ్ఞాని సాన్నిధ్యం, వారి ఉపదేశాన్ని స్వానుభవంతో ఆకళింపు చేసుకోవడం - ఇవి శీఘ్రంగా మోక్షసాధనకు అవసరమైన అవగాహన కల్పిస్తాయన్నారు. భగవాన్ వంటి జ్ఞానులు మానవ రూపంలో, గురువు లేకుండానే, ఆత్మ సాక్షాత్కారం పొందారు. కాని, ఇటువంటి సందర్భాలు బహు అరుదు. పూర్వజన్మలలో చేసిన సాధనే, వారిని అంతవరకు తెచ్చింది. ఈ జన్మలో కేవలం స్వల్ప ప్రయత్నంతోనే ముక్తులైనారు.

భగవాన్ ఉపదేశాలను వివరించవలసిన పనిలేదు. అవన్నీ ఉపనిషత్తులు, గీత, భాగవతాదులు బోధించిన సనాతన అద్వైత

వేదాంతమే. శంకరులు, విద్యారణ్యులు, గౌడపాదులు, తదితరులు బోధించిన అద్వైత వేదాంత సారమే. ఈ బోధలలో, జాగ్రదవస్థను స్వప్నావస్థతో పోల్చడం కనిపిస్తుంది. రెండూ క్షణభంగురములే. ఒకటి ఉన్నప్పుడు రెండవది ఉండదు. కాని, కలలు కనేది, మేలుకొనేది - ఈ రెండు అవస్థలను అనుభవించేది ఒక్కరే. దీనికి ఉదాహరణగా ఒక కథ చెప్తారు.

ఒకానొక రాజు కలగన్నాడు. ఆ కలలో, అతడు చందు అనే కిరాణా వ్యాపారి. ఒకరోజు పంజి అనే అందమైన (నిమ్న జాతి) యువతి మత్తెక్కిన స్థితిలో వక్క పలుకుల కోసం అతని దుకాణానికి వస్తుంది. తన ప్రవర్తన ద్వారా, అతడిని ఎంతగా ఉద్రేకపరుస్తుందంటే కులం కట్టుబాట్లను ధిక్కరించైనా సరే, ఆమెను పెండ్లాడి తీరాలని నిర్ణయించుకుంటాడు. తీరా పెళ్లి అయ్యాక ఆమె దుష్ట స్వభావం, మరింతగా బయటపడుతుంది. ఆమెపట్ల వ్యామోహం కారణంగా, చందు ఆమె దుర్గుణాలన్నింటినీ సహిస్తాడు. ఆవిడ అలవిమాలిన కోరికలు తీర్చడం అతడి శక్యం కాదు. చివరికి అతడి వ్యాపారం దివాలా తీస్తుంది. విధి నిషేధమైన పనులు చేయడానికి కూడా వెనకాడడు. ఇలా ఇరవై ఏళ్లు గడిచాయి. వారికి ముగ్గురు సంతానం కలిగారు. వారిలో పెద్దకొడుకు పెద్దయ్యేకొద్దీ, తల్లికంటె దుష్టుడిగా తయారవుతాడు. ఈ సంసారాన్ని పోషించడానికి, అవసరమైన డబ్బు కోసం, చందు చేయకూడని తప్పులెన్నో చేయవలసి వస్తుంది. వాటి పర్యవసానాలు కూడా అనుభవిస్తాడు. ఒకనాడు, చందు కొడుకు ఉద్రేకంలో ఆత్మహత్య చేసుకుంటాడు. ఈ హత్య చందు చేశాడనే అనుమానంతో, రాజాధికారులు, అతడిని

చెరసాలలో వేసి దారుణంగా చావగొడతారు. ఆ బాధ తాళలేక, అతడు బిగ్గరగా రోదిస్తాడు. ఎంత బిగ్గరగా అంటే, (జాగ్రదవస్థలో అతడు రాజు అన్నది గుర్తుంచుకోవాలి) అతడి ఆక్రందనకు రాణి గారికి మెలకువ వస్తుంది. అతడిని నిద్ర నుండి లేపడంతో చందు స్వప్న వృత్తాంతం ముగుస్తుంది. ఆ స్వప్నం రాజుగారిని ఎంతగా భయాందోళనలకు గురిచేసిందంటే, చాలా రోజులపాటు, ఆయన తన అంతఃపురం నుండి బయటకి రాలేదు. రాచరికపు విధులు నిర్వర్తించలేదు. తన స్వప్న అనుభవాన్ని మొత్తం గ్రంథస్తం చేశాడు. ''చందు ఆత్మ కథ'' పేరిట, ఆయన మహామంత్రి దానిని ప్రచురించాడు.

ఈ ఆత్మకథకు, జాగ్రదవస్థలో అనుభవించి వ్రాసిన వాటికి ఏమన్నా భేదం ఉన్నదా? ఇరవై ఏళ్ళపాటు అనుభవించిన బాధామయ జీవితం, పంజి పట్ల అతడి వ్యామోహం, అతడి నేరపూరిత జీవితం, చెరసాలలో అతడు తిన్న దెబ్బలు - ఇవన్నీ చందుకు వాస్తవానుభవాలే.

ఇదంతా రాజుగారి మనస్సులో నుండి పుట్టిన కల్పిత కథ మాత్రమేనని మీరు వాదిస్తే, జాగ్రదవస్థలో ఆయనకు ఎదురైన అనుభవాలు కూడా అంతే కదా? ఆయనకే కాదు, మనకు ఎదురయ్యే అనుభవాలు కూడా అంతే.

జాగ్రదవస్థకు ఉన్నట్లే, కలలకు కూడా తమవైన సమయ సందర్భాలు, ప్రాకృతిక సూత్రాలు ఉంటాయి. చందు విషయానికి వస్తే, అతడు మూడు అవస్థలనూ అనుభవించినవాడు.

జాగ్రదవస్థలో అతడొక రాజు. స్వప్నావస్థలో అతడొక భ్రష్టుడైన వ్యాపారి. సుషుప్తిలో మరే ఇతర అధ్యాస లేదు. తాను తానుగానే ఉన్నాడు. ఈ అవస్థలు, ఒకదాని తరువాత ఒకటి వస్తున్నాయి గాని, వాటిని అనుభవిస్తున్నది మాత్రం ఒక్కడే.

మాండూక్యోపనిషత్తులోని పది శ్లోకాలను అర్థం చేసుకున్న వారు, మిగతా ఉపనిషత్తులను అధ్యయనం చేయాల్సిన అవసరం లేదంటారు. ఎందుచేతనంటే, బాహ్య జగత్తు కూడా, మిగతా రెండు అవస్థల్లో మాదిరి మనస్సు చేసే కల్పన మాత్రమేనని, ఈ శ్లోకాలు బోధిస్తాయి. జీవుడు, తన ప్రస్థానంలో ఈ మూడు అవస్థలను అనుభవించాల్సి ఉంటుందన్న ఉపనిషద్వాక్యం ద్వారా, సాధారణ మానవుడికి మరణం అనేది క్రొత్త అవస్థేమీ కాదని గ్రహించవచ్చు. అతడికి ఇప్పటికే అనుభవమైన స్వప్నం, సుషుప్తి అనే రెండు అవస్థలు మళ్ళీ క్రొత్త దేహంలో పునర్జన్మ ఎత్తేవరకు, ఒకదాని తరువాత మరొకటి కొనసాగుతూ, జాగ్రదవస్థను కూడా పునరుద్ధరిస్తాయి. మాదకద్రవ్యాలు సేవించడం వల్ల బాహ్యస్మృతి కోల్పోవడం, హఠయోగంలో సాధించే 'లయం' - వీటికి కూడా ఇదే వర్తిస్తుంది. అయితే, జ్ఞాని ఈ జీవితంలోను, మరణానంతరము కూడా మూడు అవస్థలకు అతీతుడు. శుద్ధ చైతన్య స్వరూపమైన నాలుగో అవస్థ - తురీయావస్థ - అందులో జ్ఞాని శాశ్వతంగా, స్థిరంగా నిలిచి ఉంటాడు. ఇక ఈ అవస్థ నుండి, తిరిగి శరీర ధారణ చేయడమనేది ఉండదు. జనన మరణ బాధల నుండి శాశ్వతంగా విముక్తుడవుతాడు. అటువంటి జీవన్ముక్తులే భగవాన్ శ్రీరమణులు.

# 1929వ సంవత్సరంలో ఒక రోజు

## బి.వి. నరసింహస్వామి

శ్రీ రమణాశ్రమ ప్రచురణ Surpassing Love and Grace లోని వ్యాసానికి
స్వేచ్ఛానువాదం

అనువాదకులు: రవికృష్ణ శర్మ

శ్రీ ఎన్. నటేశయ్యరు మదురైలో పనిచేసే వకీలు. వారు ఈ ఉదయం 7.30 గంటలకు వారి కుటుంబ సభ్యులతో సహా వచ్చి భగవాన్‌కు గౌరవ వందనాలు అర్పించారు. వారు భగవద్గీతలోని ఒక శ్లోకాన్ని ఉదహరించి ఈ విధంగా అడిగారు.

**నటేశయ్యరు** : సందేహాలు ఎలా నిర్మూలింపబడతాయి?

**మహర్షి** : గ్రంథిచ్ఛేదనం ద్వారా నిర్మూలింపబడతాయి.

**నటేశయ్యరు** : గ్రంథిచ్ఛేదనం ద్వారా అన్ని కర్మలు నశించి పోతాయా? అది ఏ విధంగా అనుభవంలోకి వస్తుంది? ఈ మాయ ఎలా పైకి వస్తోంది? ఎవరికి ఈ మాయ? ఈ మాయను ఎలా నిర్మూలింపవచ్చు?

**మహర్షి**: మాయ అనేది ఏ విధంగా పైకి వస్తోంది? దానిని నిర్మూలించటం ఎలా? అని విచారణ చేసేకంటే, ''ఈ మాయ ఎవరికి?'' అనే ప్రశ్న ఒక్కటి చాలు. దీనిని గనుక విచారణ చేస్తే మిగిలిన అన్ని ప్రశ్నలు పరిష్కరింపబడతాయి.

**నటేశయ్యరు**: ఈ సందేహాలు నా మనస్సులో నాకే ఉదయిస్తున్నాయి. గ్రంథాలన్నీ నన్ను 'నేను' తెలుసుకోవాలని, 'నేను' స్వభావం ఏమిటో తెలుసుకోవాలని అంటున్నాయి. కాని నన్ను నేను ఎలా తెలుసుకోవటం?

**మహర్షి:** నేను యొక్క మూలాన్ని వెతకటం ద్వారా. ఈ నేను అనేది ఎక్కడ పుడుతోందో, దానిని వెతకటం ద్వారా నిన్ను నీవు తెలుసుకోగలవు.

**నటేశయ్యరు:** దానిని ఏ విధంగా తెలుసుకోవాలి? అది అంత తేలిక అని నేను అనుకోవటం లేదు.

**మహర్షి:** మనము మన చుట్టూ ఉన్న వాటిని చూస్తూ వాటిని గురించి స్పష్టంగా తెలుసుకోవటం లేదా? కాని, ఏ వస్తువు లేదా పదార్థము మనకంటే సత్యంగా లేదా నిత్యంగా ఉన్నదని మనము నిర్దుష్టంగా చెప్పగలము? నేనున్నాను అనేది ప్రత్యక్షానుభవము. దానిని ఇంతకంటే బాగుగా వివరించలేము.

**నటేశయ్యరు:** ఈ ప్రయత్నంలో ఒకవేళ నన్ను నేను చూసుకో లేకపోతే, అప్పుడేమి చేయాలి?

**మహర్షి:** నన్ను నేను తెలుసుకోవాలన్న తీవ్రమైన ఇచ్ఛ కలిగి ఉండాలి. ఆత్మ విచారణను లేదా అంతర్ముఖత్వాన్ని పెంపొందించుకోవాలి. నిరంతరాయంగా నీ మనస్సులో "ఏమిటి ఈ నేను?" అనే ప్రశ్న ఉదయిస్తూ ఉండాలి. అలా చేస్తూ ఉంటే కొంతకాలానికి నిన్ను నీవు చూడవచ్చు. ఎలా నిన్ను నీవు చూడవచ్చు అంటే ఏదైతే ఇంతకు మునుపు నీవు చూడలేకపోయావో దానిని ఇప్పుడు చూస్తావు. కాని ఏదైతే నీవు ఎప్పుడూ అనుభవిస్తున్నావో, దానిని చూడటానికి ఖచ్చితంగా చెప్పాలంటే అక్కడ ఏ దృష్టి ఉండదు. నిన్ను నీవు చూడడం అంటే, నిన్ను నీవు చూడటానికి అడ్డు వస్తున్న వాటిని తొలగించటమే. అంటే నీవు ఆత్మను చూడటం కాదు, ఆత్మగా ఉండటమే.

**నటేశయ్యరు:** త్రిమూర్తులు ఉన్నారని అంటారు కదా! అందులో విష్ణుమూర్తి వైకుంఠంలో ఉంటారని అంటారు. ఆ లోకం ఈ లోకంలా, సత్యమా లేక అది ఒక మిథ్యా భావనా? లేక అది ఒక అభూత కల్పనా?

**మహర్షి:** ఒకవేళ నీవు, నీచుట్టూ ఉన్న ఇతరులు మరియు ఈ ప్రపంచము ఉన్నదన్నది సత్యమైతే వైకుంఠం, మహా విష్ణువు ఉండటం ఎందుకు అసత్యమౌతుంది? ఎప్పటివరకైతే నీవు ఇది సత్యమని అంటావో అప్పటివరకు అదికూడా సత్యమే.

**నటేశయ్యరు:** నేను అద్వైత స్థితిని గురించి కాని లేదా బ్రహ్మము ఒక్కటే సత్యము మిగిలినదంతా అసత్యము లేదా మిథ్య అనే దానిని గురించి ప్రస్తావించటం లేదు. కాని నేను ఏమి తెలుసు కోవాలని ప్రయత్నిస్తున్నానంటే వ్యవహారిక స్థితిలో, కొన్ని ప్రమాణాలను సత్యంగా భావించి, వైకుంఠం ఒకటున్నదని భావిద్దాం. త్రికాలాఽబాదితం సత్యం (మూడు కాలాల యందు ఉన్న సత్యం ఒక్కటే) అనే దానిని నేను ప్రమాణంగా తీసుకోను. ఎందుకంటే వ్యావహారికంగా చూస్తే, ఈ శరీరం అనేది మనకు ఇప్పుడు ఒకటి ఉన్నది, ఇంకొక సమయంలో అది ఉండవచ్చు లేక ఉండకపోవచ్చు. ఇది ఒక కోణంలో ఆలోచిస్తే సత్యమే కదా? అలాగే వైకుంఠం కూడా సత్యమేనా? అది నిజంగా ఉన్నదా?

**మహర్షి:** ఎందుకు సత్యం కాదు? సత్యమే.

**నటేశయ్యరు:** మహావిష్ణువు, శివుడు మొదలైనవారు కూడా జీవకోటిలో ఒకరా?

**మహర్షి:** జీవుడు, ఈశ్వరుడు ఇద్దరూ ఉన్నారు. జీవులు ఒక్కటే ఈ

విశ్వంలో ఉన్నాయని కాదు దాని అర్థం.

**నటేశయ్యరు:** అలా ఐతే మహావిష్ణువు, శివుడు మొదలగు వారికి కూడా ప్రళయ కాలం ఉంటుందా? ఈ త్రిమూర్తులు కూడా అంతమౌతారా? లేక వాళ్ళు ఎప్పటికీ నశించకుండా అలాగే ఉంటారా? వాళ్ళు కూడా మిగిలిన జీవకోటిలో పాంచభౌతిక శరీరాన్ని కలిగి ఉంటారా?

**మహర్షి:** ఆ విధంగా ఆ మార్గంలో అన్వేషణ చేసేకంటే, ఈ అన్వేషణను నీవైపునకు ఎందుకు త్రిప్పుకోవు? ఎవరికి ఈ విష్ణువు, వైకుంఠం అనే భావన కలుగుతోంది?

**నటేశయ్యరు:** మహావిష్ణువు లేదా వైకుంఠం అనేది భావన లేక ఆలోచన మాత్రమేనా?

**మహర్షి:** ప్రతీది కూడా నీలో కలిగే భావన మాత్రమే. నీవు, నీ మనస్సుతో చూస్తే తప్ప ఏదీ నీకు కనిపించదు. ప్రతిది కూడా నీ మనస్సులో కలిగే భావనలే.

**నటేశయ్యరు:** అలా అయితే విష్ణువు మరియు వైకుంఠం అనేవి నేను సృష్టించుకొన్న ఒక ఊహ లేక మిథ్యా భావన మాత్రమేనా? విష్ణువుకి, వైకుంఠానికి సత్యత్వం లేదా? అవి కూడా రజ్జువు యందు సర్పాన్ని ఆరోపించిన విధంగా లేదా కుందేటి కొమ్ము వంటివా?

**మహర్షి:** కానే కాదు. నువ్వు, నీ శరీరము, ప్రాణము మొదలైన వన్నీ నిజమనుకొన్నప్పుడు, మహావిష్ణువుని, ఈశ్వరుణ్ణి అసత్యం అని నీవు ఎలా భావిస్తావు? నువ్వు ఉన్నది నిజమైతే, విష్ణువు, శివుడు కూడా నిజమే.

**నటేశయ్యరు:** నేను అటువంటి సత్యమును గురించి కాదు నా

ప్రశ్నను అడుగుతున్నది. ఉదాహరణకు కుందేటి కొమ్ము అనేది లేనేలేదు. ఎవ్వరూ, ఎప్పుడూ చూడనేలేదు. ఇది ఒక ఆత్యంతిక అభావం (ఎప్పుడూ ఉనికి లేనిది). కాని ఈ శరీరం ఉన్నది అనేది, ఏదో ఒక స్పర్శ జ్ఞానం కలిగిన వస్తువుగానైనా తెలుస్తూనే ఉన్నది కదా! ఈ రెండింటిలోని అభావానికి తేడా ఉన్నది కదా! అదేవిధంగా వైకుంఠం కూడా కుందేటి కొమ్ములా అసత్యమా?

**మహర్షి:** కాదు. నీవు ఎలాగైతే, ఈ ప్రపంచాన్ని అలాగే ఈ శరీరాన్ని అనుభవపూర్వకంగా సత్యమని అంటున్నావో, ఇతరులు ఎవరైతే వైకుంఠాన్ని అనుభవపూర్వకంగా చూశారో వారు కూడా వైకుంఠాన్ని సత్యమని అంటున్నారు. నీవు స్పర్శ జ్ఞానం ద్వారా తెలుసుకున్నది సత్యమని, అదొక్కటే (వైకుంఠం అనేది) అసత్యమని ఎందు కంటున్నావు?

**నటేశయ్యరు:** అయితే వైకుంఠం ఎక్కడో ఉన్నదన్న మాట. అదెక్కడున్నది?

**మహర్షి:** ఆ వైకుంఠం నీలోనే ఉన్నది.

**నటేశయ్యరు:** అలా అయితే, అది నాలో కలిగే ఒకానొక ఆలోచన అన్నమాట. దానిని నేను సృష్టించి, నిరోధించగలనన్న మాట.

**మహర్షి:** అలాగే ప్రతిది కూడా నీ భావన మాత్రమే.

**నటేశయ్యరు:** అది మళ్ళీ మొదటిదైన అద్వైత భావనకు దారితీస్తుంది. కాని, నేను ఏమి తెలుసుకోవాలని అనుకుంటున్నా నంటే, మనలాగే ఎవరైనా ఒక వ్యక్తి మనకంటే అన్యంగా ఉండి మన పాప పుణ్య కర్మలకు ఫలితాలను ఇస్తున్నాడా అని?

**మహర్షి:** అవును.

**నటేశయ్యరు:** అయితే ఆ ఫలదాతకు అంత్యకాలమున్నదా? ఆయన కూడా ప్రళయకాలమందు అంతరించి పోతాడా?

**మహర్షి:** ప్రళయం అనేది ఆత్మను ఆవరించి ఉన్న మాయకు. నీవు, నీలో ఉన్న లోపాలతోను మరియు పరిమిత జ్ఞానంతోను ఆత్మను సాక్షాత్కరింప జేసుకోగలిగినప్పుడు, అలాగే ఈ సంసారాన్ని, ప్రళయాన్ని దాటగలిగినప్పుడు, తర్కించటానికి వీలు లేనటువంటి, అపరిమితమైన జ్ఞానం కలిగిన ఈశ్వరుడు, ఈ ప్రళయాన్ని దాటి, దానికి ఆవల ఉండగలడని ఆశించటం సమంజసం కాదా?

**నటేశయ్యరు:** అయినా కాని నాకింకా సందేహాలు ఉన్నాయి.

**మహర్షి:** ఎవరికైతే సందేహాలు ఉన్నాయో, ఆ వ్యక్తి ఈ ప్రపంచం అంతం అయ్యేవరకు సందేహిస్తూనే ఉంటాడు.

**నటేశయ్యరు:** లేదు, ఆ సందేహాల నుండి బయటపడాలని ఎంతో ఆత్రుతతో మిమ్మల్ని వేడుకుంటున్నాను. నాలో ఉన్న అజ్ఞానానికి కారణమైన సందేహాలను తొలగించి నాకు జ్ఞానాన్ని ప్రసాదించమని మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను.

**మహర్షి:** నిన్ను నీవు తెలుసుకోవటం ద్వారా జ్ఞానాన్ని పొందవచ్చు.

**నటేశయ్యరు:** అది నేను చేయలేకపోతున్నాను. నేను అన్ని సందేహాల నుండి విడివడాలని ఎంత ప్రయత్నించినా, ఆ సందేహాలు నన్ను అంటిపెట్టుకొని ఉంటున్నాయి. అందువల్ల మీ సహాయాన్ని అర్థిస్తున్నాను. ఇతర లోకాలు నిజంగా ఉన్నాయా అన్న నా ప్రస్తుత సందేహం నాలో ఎప్పటినుంచో ఉన్నది. దేవతలు, పిశాచాలు ఉన్నాయని అన్నది నిజమేనా?

**మహర్షి:** నిజమే.

# శ్రీ భగవాన్ నా జీవితంలోకి ఎలా ప్రవేశించారు ?

(గత సంచిక తరువాయి) **తాడిమేటి సత్యనారాయణ**

నేను ఉద్యోగం చేస్తూ ఉన్నప్పుడు ఉద్యోగరీత్యా నా కంపనీ వారు నన్ను బహరైన్ పంపించారు. ఒక సంవత్సరం ఉన్నాను. మళ్ళీ రెండవసారి కొంత ఎక్కువ కాలమే అక్కడ ఉన్నాను. నాకు అప్పటికి 42 సంవత్సరాలు వచ్చాయి. రెండవసారి అక్కడకు వెళ్ళినప్పుడు వేరొకచోట పనిచేస్తున్న రంగనాథన్ అనే భారతీయుడు పరిచయమయ్యారు. అతను పరమహంస యోగానంద భక్తుడు. క్రియా యోగలో దీక్షను తీసుకొని సాధన చేస్తున్నాడు. అతను నాకు వేదాంతం 4 సంవత్సరాలు నేర్పించాడు. జగత్తు అంటే ఏమిటి? ఆత్మ అంటే ఏమిటి? ఈశ్వరుడు ఎవరు? అనే వాటిమీద ప్రాథమిక మైన అవగాహనను కల్పించాడు. అతను నాకు స్నేహితుడేకాక నా మొదటి గురువు అని చెప్పవచ్చు. నాతో పాటే హైదరాబాద్‌కు చెందిన జగదీశ్ అనే వ్యక్తి కూడా నాకు అక్కడ పరిచయమయ్యాడు. ఆ దేశం అరబ్బు దేశం కావటంతో గురు, శుక్రవారాలు సెలవులు ఉండేవి. అప్పుడు మా ఇంట్లోనో, రంగనాథన్ గారింట్లోనో, మా ఇంకొక స్నేహితుడైన జగదీశ్ గారింట్లోనో మేము కలుసుకొని ఆధ్యాత్మిక చర్చలు చేసేవాళ్ళము. మేము జిడ్డు కృష్ణమూర్తి గారి గురించి, పరమహంస యోగానంద గారి గురించి, నిసర్గదత్త మహరాజ్ గురించి రమణ మహర్షి గురించి మాట్లాడుకునే వాళ్లము. నేను 1983లో మొట్టమొదటిసారిగా నా కుటుంబంతో కలిసి శ్రీ రమణాశ్రమానికి వెళ్లాను. గిరి ప్రదక్షిణ చేశాము. ఆశ్రమంలో 3

రోజులు ఉన్న తరువాత తిరిగి బహ్రెయిన్ వెళ్ళిపోయాము. నేను పరమహంస యోగానంద గారు చెప్పిన యోగసనాలను ప్రాక్టిసు చేసి, వాళ్ళ మెంబర్‌షిప్ తీసుకొన్నాను. అందులో భాగంగా వాళ్ళు కొన్ని పుస్తకాలను ఇచ్చారు. వాటిలో ధ్యానం ఎలా చేయాలో తెలియచేశారు. ఇక బహ్రెయిన్‌లో పని చేస్తున్న కంపనీలో నేను చేయవలసిన పని అయిపోవటంతో పాటు సత్సంగాలు కూడా ముగింపు దశకు చేరుకున్నాయి. ఒకరోజున బహ్రెయిన్ లో రంగనాథన్ ఇంట్లో సత్సంగం అయిన తరువాత భోజనం చేసి బయలుదేరే ముందు వాళ్ళ ఇంట్లో ఉన్న పూజామందిరంలోకి వెళ్ళి అక్కడ ఉన్న కృష్ణునికి, పరమహంస యోగానందకు, నిసర్గదత్ మహారాజ్‌కు, భగవాన్ రమణ మహర్షికి నమస్కరించి వస్తూ ఉంటే నాలోనుండి ఒక మాట వినిపించింది. 'నన్ను విడిచి వెళ్తున్నావా?' అని భగవాన్ నన్ను అడిగినట్లు అనిపించింది. ఎప్పుడైతే ఆ మాట వినిపించిందో నా కళ్లల్లో నుండి కన్నీరు బొట, బొటా కారింది. కొంతకాలం తరువాత నేను రంగనాథన్ ను కలిసినప్పుడు, ఇప్పుడు నేను ఏమి చేయాలి? అని అడిగితే క్రియా యోగ దీక్షను తీసుకోమని సలహా ఇచ్చాడు. దాంతో నేను 1988లో భారతదేశం తిరిగి వచ్చినప్పుడు రాంచిలో ఉన్న వాళ్ళ ప్రధాన కేంద్రానికి వెళ్ళి దీక్షను తీసుకొన్నాను. కానీ మనస్సులో భగవాన్ నన్ను లాగుతూ ఉన్నట్లు అనిపించింది. ఆ తరువాత నెమ్మదిగా నాకు భగవాన్ చెప్పిన ఆత్మ విచారణ నాకు బాగా నచ్చింది. నేను క్రియా యోగాలో చెప్పిన విధంగా ప్రాక్టీసు చేస్తున్నప్పటికీ, అదే సమయంలో నా స్వభావానికి

జ్ఞానయోగమే సరైనది అనే దృఢమైన నమ్మకం నాలో కలిగింది. అలాగని నేను ఒక గురువును వదిలి పెట్టి ఇంకొక గురువు దగ్గరకు వెళ్తున్నట్టు కాదు. ఈ రోజుకి కూడా నా పూజా మందిరంలో భగవాన్ ఉంటారు, పరమహంస యోగానంద గారు ఉంటారు, కంచి పరమాచార్య ఉంటారు.

కొంతమంది నన్ను ఇలా అడుగుతూ ఉంటారు. మీరు మీ గురువైన పరమహంస యోగానందను విడిచి భగవాన్ దగ్గరకు ఎలా వెళతారు? అని. కానీ నేను పరమహంస యోగానందను ఏమీ విడువలేదు. ఆయనే కొంతకాలం క్రియా యోగం ద్వారా, ధ్యానం ద్వారా నన్ను శుద్ధి చేసి భగవాన్ దగ్గరకు పంపించారు. శరీరాలు భిన్నమైనప్పటికీ గురువు ఒక్కడే.

అలా 1988లో హైదరాబాద్‌కు వచ్చిన తరువాత ఉద్యోగానికి పదవీ విరమణ చేసి లక్డీకాపూల్‌లో ఉంటున్న రోజులలో పాత పేపర్లను తీసివేస్తూ ఉంటే అందులో ఒక పేపరులో ఉపదేశసారం ఆంగ్లంలో అచ్చు అయి ఉన్నది. దాన్ని అప్పుడే మొదటిసారి నేను చూడటం. అది చదువుతున్నప్పుడు చాలా బాగున్నదే అని అనిపించి చదవటం మొదలుపెట్టి 18వ శ్లోకానికి వచ్చినప్పుడు 'మనస్సు అంటే ఏమిటి?' అది తలపుల సమాహారం అని చదివినప్పుడు ఒక్కసారిగా మనస్సు ఆగిపోయింది. అది భౌతికంగా చూస్తే 3 నుండి 4 సెకండ్లు అయి ఉండవచ్చు కానీ దాని ప్రభావం నా మీద చాలా చూపించింది. ఏ క్షణంలో అయితే ఆలోచనలు ఆగిపోయాయో అప్పుడు అనంతమైన ఆనందాన్ని చవిచూశాను.

దాని జ్ఞాపకాలు చాలా కాలం నాలో ఉండిపోయాయి. మళ్ళీ ఆ అనుభూతిని నేను పొందాలి అనుకొన్నా అది జరిగేది కాదు.

ఆ తరువాత కాలంలో నేను తిరువణ్ణామలైకు ప్రతి సంవత్సరం వెళ్లి రావటం జరుగుతూ ఉండేది. ఆ సమయంలోనే నేను, రంగనాథన్ మరియు జగదీశ్ తిరువణ్ణామలైలో స్థిరపడి పోదామనుకొని అక్కడ ఒక స్థలాన్ని కొన్నాము.

మా ముగ్గురిలో రంగనాథన్ ఒక్కరే ఇప్పుడు తిరువణ్ణామలైలో స్థిరపడ్డారు. ఇది కూడా భగవాన్ నిర్ణయం. అందరూ తిరువణ్ణా మలైలో ఉండటానికి భగవాన్ అనుమతి లేదని భావించాము. నేను హైదరాబాద్‌లో, జగదీశ్ కెనడాలో స్థిరపడ్డాము. మేము ఇప్పటికీ ఫోన్లో మాట్లాడుకుంటూనే ఉంటాము.

## రమణ కేంద్రంతో అనుబంధం:

1991లో ఒకసారి ది హిందూ న్యూస్‌పేపర్‌ను తిరగవేస్తూ ఉంటే అందులో శ్రీరమణకేంద్రంలో జరిగే సత్సంగం గురించి ప్రకటనను చూసి మరుసటి ఆదివారం గాంధీ శతాబ్ది హాలులో జరుగుతున్న సత్సంగానికి హాజరయ్యాను. అప్పుడు డా.కే.యస్. గారిని మొదటిసారి దర్శించాను. ఆ సత్సంగంలో శ్రీ రమణయ్య గారు ఒక ప్రకటన చేశారు. "ఈవేళ మన మధ్యలో ఒక నూతన భక్తులు ఉన్నారు. వారిని రెండు నిమిషములు మాట్లాడవలసినది" అని నన్ను పిలిచారు. నాకు ఆశ్చర్యమేసి నేనేమి మాట్లాడగలను? అని అంటే భగవాన్ గురించి మాట్లాడమన్నారు. అప్పుడు మొదటి సారి నేను 35 నిమిషాలు మాట్లాడాను. నా జీవితం ఎలా

కొనసాగింది? భగవాన్ నా జీవితంలోకి ఎలా ప్రవేశించారో అనే విషయాన్ని చెప్పాను. నేను మాట్లాడిన తరువాత కే.యస్. గారు నన్ను ఎంతో ఆప్యాయంగా పలకరించారు. నన్నప్పుడు మీరెక్కడ ఉంటారు అని డా. కే.యస్. గారు అడిగితే వివరాలు చెప్పగానే కృత్తివాసన్ గారి అడ్రస్ ఇచ్చారు. అలా కృత్తివాసన్ గారు పరిచయ మయ్యారు. ఆ తరువాత కాలంలో నేను రమణకేంద్రంలో తరచూ మాట్లాడుతూండేవాణ్ని.

పూర్వము ప్రతి సంవత్సరము శ్రీ రమణాశ్రమం వెళ్తూ ఉండేవాడిని. కానీ ఈ మధ్య కాలంలో వయోభారం వల్ల ఆశ్రమానికి వెళ్ళటం తగ్గింది. క్రితంలో భగవాన్ డైరెక్ట్ భక్తులైన శ్రీ అన్నామలై స్వామిని, శ్రీ బలరామ రెడ్డి గారిని, శ్రీ కుంజు స్వామిని, శ్రీ తిన్నై స్వామిని, శ్రీ కనకమ్మ గారిని కలుసు కోవటం జరిగింది. అన్నామలై స్వామిని ఒకసారి కలిసినప్పుడు నేను ఏమి చేయాలి? అని వారిని అడిగితే నా తలమీద చిన్న మొట్టికాయ వేసి 'నేను ఎవరు?' అనే పుస్తకాన్ని రెగ్యులర్‌గా చదవమని చెప్పి, అది సరిపోతుంది అని అన్నారు.

శ్రీ రమణాశ్రమంలో ఉన్నప్పుడు భగవాన్ నాకు రెండుసార్లు ఆత్మనిష్ఠలో ఉండటం అంటే ఏమిటో రుచి చూపించారు. మొదటిది, ఆశ్రమంలో నేను ఉండటానికి ఒకసారి నాకిచ్చిన గడువు అయిపోయిన తరువాత, హైదరాబాద్‌కు బయలుదేరేముందు ఓల్డ్ మెడిటేషన్ హాలులో భగవాన్ సోఫాలో కూర్చున్న ఫోటో ముందు కళ్ళు మూసుకొని నమస్కరిస్తున్నప్పుడు ఒక్కసారిగా మనస్సు ఆగి పోయింది. భౌతిక లోకం దృష్టితో చూస్తే అది ఒక 5 సెకెండ్లు

అయి ఉండవచ్చు. కానీ ఆ క్షణంలో సచ్చిదానందాన్ని అనుభూతి చెందాను.

ఇక రెండవది, ఈ మధ్య కాలంలో 2018లో నేను ఆశ్రమం వెళ్ళినప్పుడు ఆశ్రమంలో ఒక్క నిమిషం కూడా కూర్చోలేకపోయాను. ఏదో తెలియని అలజడి. సమాధి హాలుకు వెళ్ళి అక్కడ కూర్చుందామనుకుంటే అక్కడా కూర్చోలేకపోయాను. నిలుచుందాం అనుకొంటే నిలుచోలేక పోయాను. అదే సమయంలో గణేషన్ గారి ప్రవచనం ఆర్కైవ్స్ హాలులో ఉన్నది అని తెలిసి అక్కడకు వెళ్లాను. అక్కడ నొచ్చుర్ వెంకట్రామన్ గారు కూడా ఉన్నారు. కాసేపు అక్కడ కూర్చున్న తరువాత ఒక్కసారిగా నాలో ఏదో తెలియని ప్రశాంతత ఆవరించింది. బయటకు వచ్చినా అదే ప్రశాంతతను అనుభూతి చెందాను. నా చుట్టూ ఉన్న వాతావరణం అంతా కూడా ఎంతో ప్రశాంతంగా ఉన్నట్లు అనిపించింది. అప్పుడు నేనొక ఆనందమయ స్థితిలోకి వెళ్ళినట్లు అనిపించింది.

**రచనలు:**

2011 నవంబర్లో ఒకసారి నేను ఆశ్రమానికి రాత్రి 7 గంటల సమయంలో చేరాను. వెళ్ళినప్పుడు ప్రసాదం తీసుకొని ఓల్డ్ మెడిటేషన్ హాల్‌కు వెళ్ళి భగవాన్‌కు నమస్కరించి వస్తూ ఉంటే నాకు తెలిసిన ఒక 20 మంది భక్తులు నన్ను కలసి మురుగనార్ గారు రచించిన ''రమణ సన్నిధి ముఱై''ను తెలుగులోకి అనువదించమని చాలా బలవంతం చేశారు. దానికి నేను 'అది చాలా పెద్ద గ్రంథం, కుదరదు' అని అంటే వాళ్ళు అదంతా మాకు తెలియదు. మీరే అనువాదం చేయాలి అని పట్టుబట్టారు. దాంతో

నేను భగవాన్‌తో 'ఏంటి భగవాన్, నేను నిన్ను చూద్దామని వస్తే నా నెత్తిన ఈ భారం పెట్టావు?' అని అన్నాను. ఆశ్రమంలో పనిచేసే చంద్రమౌళి గారు నాకు మంచి స్నేహితుడు కావటంతో అతనితో ఈ విషయం చెప్పాను. అప్పుడతను పెద్ద పనే ఇది. ఆలోచిద్దాము అని అన్నాడు. మరుసటి రోజు ఉదయం నేను నా స్నేహితుడైన రంగనాథన్ ఇంటికి వెళ్లాను. అక్కడ రంగనాథన్ శ్రీమతితో ఏంటమ్మా వీళ్ళందరూ "రమణ సన్నిధి ముఱై"ను తెలుగులోకి అనువదించమని అడుగుతున్నారు అని చెపితే తను ఏమీ లేదన్నయ్యా నేను క్రిష్ణమూర్తి శ్రీరాం గారు వివరాలతో 10 వోల్యుమ్స్‌లో రచించిన "రమణ సన్నిధి ముఱై" భాష్యాన్ని మీకిస్తాను అని చెప్పి ఆ పుస్తకాలను నా చేతిలో పెట్టింది. అప్పుడు నాకు 'ఇది కూడా భగవాన్ అనుగ్రహమే' అనిపించింది. అప్పుడు రమణాశ్రమంలోనే ఆ గ్రంథాన్ని అనువదించటానికి శ్రీకారం చుట్టాను. ఆ తరువాత కాలంలో తిరువాచకం కూడా అనువాదం చేశాను. కనకమ్మ గారితో మంచి పరిచయం ఉండటంతో వారు తమిళంలో అక్షరమణమాలకు వ్రాసిన దానిని కూడా అనువదించాను. దేవీ కాలోత్తరానికి కనకమ్మ గారు తమిళంలో వ్యాఖ్యానం వ్రాస్తే దానిని తెలుగులో నేను చాలా కాలం క్రితమే అనువదించాను. దానిని ఈ మధ్యనే శ్రీరమణ జ్యోతిలో ధారావాహికంగా ప్రచురించారు. ఇది నాకు భగవాన్‌తో ఉన్న చిన్నపాటి అనుబంధం. భగవాన్ అనుగ్రహం ఎల్లవేళలా మనందరి యందు ఉండాలని ఆశిస్తూ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ.

### అధ్యాయము - 4

# భగవాన్ భక్తులు - గోవులు

**శ్రీ రమణాశ్రమ ప్రచురణ** Bhagavan Ramana The Friend of all **లోని 4వ అధ్యాయానికి స్వేచ్ఛానువాదం**

**వి. రమేష్ బాబు**

భగవాన్ శ్రీ రమణ మహర్షికి అత్యంత ప్రీతిపాత్రమయిన జంతు భక్తురాలు గోలక్ష్మి స్వభావంలోనూ ప్రవర్తనలోనూ మనిషి లాగానే ప్రవర్తించేది. భగవాన్‌కు సంపూర్ణ శరణాగతి చెందిన ఒక విశేష భక్తురాలు. భగవాన్ ఆమెపట్ల చూపిన దయ, కరుణ అపూర్వం. మానవులు మాత్రమే మోక్షాన్ని పొందుతారని ఒక సాధారణ నమ్మకం. కానీ జూన్ 18, 1948న ఆమె తన గురువు, దైవము అయిన భగవాన్ (శ్రీరమణుల) చేతుల మీదుగా మోక్షాన్ని పొందింది.

ఆమె అందరి చేత ప్రేమింపబడింది. ఆమె జీవితకాలమంతా భగవాన్ పట్ల దృఢభక్తితో వ్యవహరించింది. భగవాన్ కరుణ వలననే గోలక్ష్మి ఆశ్రమానికి వచ్చి వారి పాదాలను సేవించి మోక్షాన్ని పొందింది. సౌందర్యంతో అలరారుతూ హుందాగా, సాధువుగా, ప్రేమ పూర్వకంగా ప్రవర్తించేది లక్ష్మి. ఇతరుల సహాయం అవసరం లేని శరీర దారుఢ్యం ఆమెది. ఆమె అందరి పూజలందుకున్నది. ఆమె జీవిత చరిత్ర ఆనందదాయకమే కాక, స్ఫూర్తిదాయకం కూడా. ఆశ్రమంలో ఈ రోజున గోసంపద 300 వరకు ఉన్నది. వందల మంది ఆశ్రమ భక్తులకు, సందర్శకులకు ఆవు పాలు, పెరుగు, నెయ్యి, భోజనశాలలో వడ్డింపబడుతున్నది. (సశేషం)

# Why Gandhiji and Bhagavan Never Met

Dr K Subrahmanian

Our faith gets strengthened whenever we listen to someone talking about the numerous miracles that happened to him or to the members of his family. We are all human; so, whenever we are in deep trouble, we become desperate, and pray to God for a miracle. When it happens, sometimes totally and unexpectedly, we say it happened because of the grace of God. We must remember that the very fact we are alive is a miracle, and it is also because of the grace of God. Bhagavan says that nothing happens in this world without his grace. The moment we are convinced about this, not only intellectually, but also emotionally, then, we will accept everything that happens as a result of his grace. Usually, however, it is only when something good happens that we attribute it to the grace of the Lord. When something bad happens,we believe, quite wrongly, that God didn't shower his grace on us.

If grace is associated with only something good, and I believe that God is grace, then one day or the other, God is not going to be gracious. If I fall ill, and everyone prays, and I become all right, then everyone would say that it was because of the grace of God. But one day, I will not become all right, and I will leave the world. I will no longer be available to talk of the grace of God. People, especially those who were close to me, might say that God was unkind for not taking care of me during my hour of need. In other words, we associate the lack of grace with things

we don’t like. On such occasions, we must remember what Bhagavan and others have said about grace – everything that happens is because of grace; it is something that is always flowing. It is because of our limited mind we consider certain things as good and certain things as bad. However, the moment his grace is fully upon us, we will accept everything that happens. The moment we do this, again through his grace, then, there is no sorrow of any kind, whatsoever; and there is also not the kind of happiness that we have at the moment when something good happens to us. We go beyond all this, and then, there is only peace.

Sometimes, all of us would like to have *shanti* and not do some of the things we are doing. We may say that we want to be like the Maharshi – live in a place and not be bothered by anything else. Some of us wonder why it is that we are not able to retire completely. Now that is not in our hands. We should realise that there is no way of understanding how the divine power works. Bhagavan says if we have to work, we will work; if we are destined not to work, however hard we may try, we will not get any work. It is not the question of doing something or not doing something – the attitude is work or the absence of work. Bhagavan says that if we put all our burdens on him, he will get us to be involved in the work, and yet not be involved. We will be used as an instrument by him.

There was a person in our midst, who worked from three o’clock in the morning till nine o’clock in the night, day after day, for years and years. He never had a weekend

